కొన్నిసార్లు మనం వెళ్లాలనుకున్న బస్సు వేళకు ఒక్కటీ రాదు. మనకు అనవసరం లేని బస్సులు మాత్రం అనేకం వచ్చిపోతూంటాయి.

రవి విసుగ్గా టైమ్ కోసం రిస్టువాచీ చూసుకున్నాడు. తొమ్మిది అవుతోంది. ఈరోజు తెల్లవారకముందే లేచి ఆదరా బాదరాగా రెడీ అయి బస్టాండుకి అతడు వచ్చి చాలాసేపైంది. ఎంక్వయిరీలో బస్సు ఎప్పుడు వస్తుందని అడిగితే, ఇప్పుడే డిపో నుండి వచ్చేస్తుంది అని చెప్పారు. కానీ వచ్చే జాడలు కనిపించట్లేదు.

# మంచుకొండ

## డా. రఘువర్మ

ఫైలులో సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు వగైరా అన్నీ సరిగ్గా ఉన్నాయో, లేదో చూసుకున్నాడు రవి. ఇంటర్మీడియెట్ వరకూ గవర్నమెంటు జూనియర్ కాలేజీలో చదివిన ఇతడు పేదవాడు కావడంవల్ల డిగ్రీ చదవాలని ఎంతగా ఉన్నా, ఆ కోరికకు ఫుల్‌స్టాప్ పెట్టక తప్పింది కాదు. తరువాత ఒక మోటారు వర్క్‌షాపులో పనికి కుదురుకున్నాడు. ఈమధ్యే ప్రైవేటుగా డిగ్రీ పూర్తి చేశాడు. ఇప్పుడది ఎంప్లాయిమెంట్ ఆఫీసులో నమోదు చేయించాలి. ఇవాళ అందుకే అర్జెంటుగా జిల్లా కేంద్రం కరీంనగర్‌కు బయల్దేరాడు.

నుదుట పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకుని రవి ఒక్కసారి బస్టాండు కోలాహలంగా ఉంది. కొన్ని బస్సులు వచ్చి కొందరిని తీసుకువెళ్తున్నా కూడా, మళ్లీ ఎప్పటిలాగానే చెలమలోని నీరులాగా జనం ఊరుతూనే ఉన్నారు. బస్సులకోసం ఎదురు చూపులు చూస్తున్న కొందరు ప్రయాణీకులు తమ అసహనాన్ని దాచుకోవడానికి రకరకాల భంగిమల్లోకి మారి నిల్చొంటున్నారు. మరికొందరు ప్రయాణీకులు రాని బస్సులకోసం నవరసభావాలను తమ ముఖాల్లో వెంటవెంటనే ప్రదర్శిస్తున్నారు. ఇంకొందరు ప్రయాణీకులేమో పైన తగిలించి ఉన్న టీ.వీ.ల్లో సినిమా పాటల్ని చూస్తున్నారు. బస్సు ఇంకా రాలేదన్న బాధను తాత్కాలికంగా మరుస్తున్నారు.

అసలైన ప్రయాణీకులు ఇలా రకరకాల అవస్థల్లో నిలబడి ఉంటే ప్రయాణీకులు కానివాళ్లేమో బెంచీలపై దర్జాగా కూర్చుని సిగరెట్లు తాగుతూ, విలాసంగా పాన్లు నములుతూ, ఆడ ప్రయాణీకుల వైపు అదేపనిగా వెర్రిగా చూస్తూ, వెకిలిగా నవ్వుతూ బాతాఖానీ వేసుకుంటున్నారు. కొందరు షోకిల్లా రాయుళ్లు దొరబాబుల్లాగా కూర్చుని చెదరని జుట్టు చెదరిపోయినట్లుగా మాటిమాటికీ దువ్వుకుంటున్నారు. ప్చ్! ప్చ్! సరైన స్థానాల్లో సరైనవాళ్లు లేకుండా నేడు దేశం అంతటా పరిస్థితి ఇట్లాగే ఉంది అనుకున్నాడు రవి.

ఇలా అనుకుంటూండగానే డిపో నుండి కరీంనగర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చేసింది. అంతవరకూ ఎక్కడెక్కడో పచార్లు చేస్తున్న ఈ బస్సు తాలూకు ప్రయాణీకులు మూకుమ్మడిగా వచ్చిపడ్డారు. రవి వాళ్లలోంచి ముందుకు దూసుకుపోయి, బస్సులో కిటికీ పక్కన సీటు సంపాదించుకోగలిగాడు. ఎప్పుడైనా ఎక్కడికైనా ప్రయాణం చేస్తున్నప్పుడు ఇలా విండో పక్కన కూర్చుని ప్రకృతిని పరిశీలించడం రవికి హాబీ!

రవి సీట్లో కూర్చోగానే కిందనుండి "హలో! బాబూ! ఒక సీటు ఆపవా ....?" అనే అభ్యర్థన వినిపించింది. అందుకు అవసరమైన కర్చీఫ్‌ని ఒక చేయి అందించింది. అప్పటికే అన్ని సీట్లలోకి కర్చీఫ్‌లూ, టవళ్లూ చేరుకున్నాయి. తన పక్క సీటుమాత్రం ఖాళీగా ఉంది. అక్కడ కర్చీఫ్‌ని వేసేసి ఇంతకూ సీటు ఆపమన్నది ఎవరా అని కిందకు చూశాడు.

అక్కడ డాక్టరుగారు నిల్చుని ఉన్నారు. పక్కనే వారి చెల్లెలు కుడిచేతిలో సూట్‌కేస్‌తో, ఎడమ చేతిలో వానిటీ బాగ్‌తో, పంజాబీ డ్రెస్‌లో మహా హుందాగా ఉంది. తన ఇంటర్మీడియెట్ చదువు ముగిసి, కష్టాలలో ఉన్నప్పుడు ఈ డాక్టరుగారే ఆదుకుని, వాళ్ల మేడ ముందున్న వర్క్‌షాపులో పని ఇప్పించి పుణ్యం కట్టుకున్నారు. అందుకే రవి ఈయనగారిని దేవుడిలా కొలుస్తూంటాడు.

"నమస్తే, సార్!" అంటూ రవి భయభక్తులతో డాక్టరుగారికి నమస్కరించాడు.

డాక్టరుగారు రవి వైపు చూసి నవ్వి, "ఓఁ...! ఈ సీట్లో కూర్చున్నది నువ్వేనా? మా చెల్లాయ్ వాణి ఇవాళ హైదరాబాదు వెళ్తోందయ్యా! అందుకే సెండాఫ్ చేయడానికి వచ్చాను. మరి నువ్వెంతవరకూ?"

"నేను కరీంనగర్ వరకే సార్!" అని వినయంగా సమాధానమిచ్చాడు రవి.

"అయితే, నువ్వే కాస్త దగ్గరుండి కరీంనగర్లో మా చెల్లాయిని హైదరాబాదు బస్సు ఎక్కించాలి. ఏమంటావ్? వాణీ ... ఈ అబ్బాయి మనకు పరిచయమున్నవాడే! ఇక నేను వెళతానమ్మా! రవీ...! నాకు హాస్పిటల్‌కి వెళ్లే టైమైంది వెళ్తాను!" అంటూ డాక్టరుగారు వెళ్లిపోయారు.

గవర్నమెంటు డాక్టరుగా వీరికి ఫస్ట్ అపాయింట్‌మెంట్ ఈ ఊళ్లోనే వచ్చింది. తరువాత అకారణంగా ఎవరో ఏదో అన్నారని ఆ జాబ్‌కి రిజైన్ చేసి ఇక్కడే ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టి తన సింప్లిసిటీతో, సిన్సియారిటీతో ప్రజల అభిమానాన్ని సంపాదించుకుని మంచి డాక్టరుగా పేరు తెచ్చుకున్నారు. ఒక్కసారి హైస్కూల్ వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ డాక్టరుగారు ఆ ఏడు ఆటపాటల్లో అనేక బహుమతుల్ని గెలుచుకున్న రవిని ప్రత్యేకంగా అభినందించి, పైగా ... సన్నగా పీలగా ఉండే ఇతడికి కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించమని కూడా చెప్పారు. అప్పటినుండీ రవికి ఈ డాక్టరుగారంటే ... విపరీతమైన గౌరవాభిమానాలు.

ఆ డాక్టరుగారి ఒక్కగా నొక్క చెల్లెలు ఈ వాణి. డాక్టరుగారి చెల్లెలనీ రవి ఈమె పట్లా ప్రత్యేక అభిమానం చూపుతాడు. ఈమె ఇప్పుడు హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. ఇంగ్లీషు లిటరేచర్ చదువుతున్నదని విన్నాడు.

రవికి కూడా లిటరేచర్ అంటే పంచప్రాణాలు. ఇంటర్మీడియెట్‌లో ఉన్నప్పుడు ఇంగ్లీషు లెక్చరర్ చెప్పే పాఠాల్ని శ్రద్ధగా వింటూ, వీలు చిక్కినప్పుడల్లా, 'రొమాంటిక్ పొయట్రీ' గురించి మరీ అడిగి తెలుసుకుంటూండేవాడు. అట్లాగే, తెలుగు లెక్చరర్‌ను 'భావకవిత్వం' తీరుతెన్నుల గురించి అడుగుతూ అప్పుడప్పుడూ తాను ప్రకృతిపైనా, ప్రేమపైనా రాసిన లేలేత కవితల్ని ఆయనకి చూపించి కరెక్షన్ చేయించుకునేవాడు. ఆ గోల్డెన్ డేస్ మళ్లీ రావు అని నిర్లిప్తంగా తనలో తానే నవ్వుకున్నాడు రవి.

ఇంతలో జనంతో కిక్కిరిసి ఉన్న బస్సులోకి డాక్టరుగారి చెల్లెలు రాగానే రవి లేచి, "ఇలా రండి!" అంటూ ఆమె చేతిలోని సూట్‌కేస్‌ను అందుకుని పైన సర్దేసి, "ఇక కూర్చోండి!" అంటూ తాను కిటికీ వైపు ఒదిగి కూర్చున్నాడు.

"హైదరాబాదుకు వెళ్తున్నారా!" వెళ్తుందని తెలిసి కూడా మర్యాదకు మాట్లాడాలి కాబట్టి అడిగాడు రవి.

"ఊఁ."

"మరి డైరెక్ట్ బస్సులో వెళ్లొచ్చును కదా?"

"అలా వెళ్తే రాత్రవుతుందనీ ... ఎందుకంటే ఇప్పుడప్పుడే ఆ బస్సు లేదు కదా?" అని తీపిదనాలన్నీ కలబోసిన గొంతుతో సమాధానం

చెప్పింది.

రవి ఇంతవరకెప్పుడూ ఈమెతో మాట్లాడలేదు. ఇంత దగ్గరగా కూర్చోలేదు కూడా. ఇదే మొదటిసారి. తను పనిచేసే వర్క్‌షాప్ ముందే వాళ్ల నివాసం కాబట్టి రోజులో ఎప్పుడో ఒకసారి తప్పక కనిపించేది. ఈమె కనిపించని రోజున తాను చేసే పనిలో ఏదో పొరపాటు చేసి యజమాని చేత తిట్లు తినేవాడు కూడా. మెరుపుతీగలాగా మెరిసి వెళ్లిపోయే ఈవిడకు "సౌదామిని" అనే పేరుంటే ఎంతో బాగుండేది అని అనుకునేవాడు (ఇప్పటికీ అనుకుంటున్నాడు). నల్లని చక్కని చిక్కని పొడమైన కురులను ఈమె తన జడలో బంధించుకునే తీరును ప్రకాశంగా కాకుండా స్వగతంగా ప్రశంసించేవాడు.

కండక్టర్ విజిల్ వేశాడు. బస్సు స్టార్టయి బయల్దేరింది. దీనికి దారిలో రెండే రెండు రిక్వెస్ట్‌డ్ స్టాపులున్నాయి. కనుక ఇంకొక గంటలో కరీంనగర్‌కు చేరుకుంటుంది.

"టికెట్! టికెట్!" అంటూ వచ్చాడు కండక్టర్. డాక్టరుగారి చెల్లెలు డబ్బుకోసం వానిటీ బాగ్‌ను వెదుకుతోంది. డబ్బందులో లేనట్లుంది. "అయ్యో! డబ్బంతా సూట్‌కేస్‌లోనే ఉండిపోయింది!" అంటూ సూట్‌కేస్‌ను తీసుకోవడానికి లేవబోయింది. స్టాండింగ్ పాసింజర్స్‌తో ఫుల్ రష్‌గా ఉన్న ఈ బస్సులో ఆమె లేచి సురక్షితంగా సూట్‌కేస్‌ను అందుకోవడం అసాధ్యమైన పని!

అందుకే రవి "అబ్బే! మీరలాగే కూర్చోండి, మీ టికెట్ కూడా నేనే తీస్తాను!" అంటూ రెండు టికెట్లు కరీంనగర్‌కు తీసుకున్నాడు.

"మీరెందుకు తీసుకోవడమండీ ...!" అని దీర్ఘాలు తీసింది డాక్టరుగారి చెల్లెలు.

తాను చేసిన పనిని ఎవరైనా సరిగా అర్థం చేసుకోకుంటే రవికి చిర్రుమంటుంది. ఆమెవైపు చూసి, "మీరంతగా ఫీలయితే కరీంనగర్లో బస్సు దిగిన తరువాత నా డబ్బు నాకిచ్చేయండి! సరేనా?" అంటూ తాను మరీ కర్కశంగా మాట్లాడలేదు కదా అని సందేహపడి బాధపడ్డాడు.

ఎక్స్‌ప్రెస్ బస్సు ఊరి పొలిమేరను దాటింది. రవి విండోనుండి ప్రకృతిని పరిశీలించసాగాడు. ప్రకృతి ఎందుకో ఇంతకు ముందరికన్నా చాలా చాలా అందంగా కనిపిస్తోంది. ఇదంతా డాక్టరుగారి చెల్లెలి ప్రభావమేమో?! ఈమె సన్నిధిలో కూర్చోవడం మాత్రం రవికి మరపురాని అనుభూతి! మనసులో కోటి వసంతాల



# అతిచిన్న చర్చ్

**కెనడా** దేశంలోని అతి చిన్న చర్చ్ ఇది. 1857లో నిర్మించిన దీంట్లోకి ఒకోసారి ఒక్కొక్కరు చొప్పునే వెళ్లేంత చిన్న ప్రవేశ ద్వారం ఉంది. దీంట్లో కేవలం ఆరుగురే పడతారు ప్రీస్ట్‌తో సహా. ఆల్బర్టాలోని డ్రమ్ హెల్లర్ అనే ఊళ్లోగల ఈ అతి చిన్న చర్చ్‌ని కట్టడానికి ఆ ఊళ్లో నాస్తికులే అప్పట్లో ఎక్కువగా ఉండటం కారణం.

-ఎం. కావ్య



కోయిలల్ని కూయించే మధురానుభూతి!

సౌందర్యారాధకుడిగా ఒకసారి డాక్టరుగారి చెల్లెల్ని తేరిపార చూడాలనిపించింది రవికి. కానీ ఆమె ఏమైనా అనుకుంటే ఎలా? తాను చూస్తూన్నదెవరైనా గమనిస్తే ఎలా? ఇంతమంది స్టాండింగ్ పాసింజర్సు ఉన్న బస్సులో ఎవరు గమనిస్తారు? ఏమో? తనకు వెంటనే అదృశ్యమైపోయే టాబ్లెట్ ఏదైనా దొరికి ఉన్నా బాగుండేది. తనివితీరా 'ఎంతసేపైనా చూస్తూ కూర్చునేవాడు. క్షణాలు నిండుగర్భిణుల్లా నడుస్తున్నాయి.

కొంతసేపైన తర్వాత డాక్టరుగారి చెల్లెలు వానిటీబాగ్ నుండి ఏదో పుస్తకం తీసింది. రవి ఓరచూపుతో దాన్ని చూశాడు. అది 'లవ్ పొయమ్స్ ఆఫ్ టాగూర్'. గాలికి ముందుకు దూకే ముంగురుల్ని కోమలమైన వేళ్లతో స్టయిల్‌గా వెనక్కి తోసుకుంటూ ఆ పుస్తకాన్ని శ్రద్ధగా చదువుకుంటోంది. మంచి అభిరుచి ఉన్న అమ్మాయే! అని అనుకున్నాడు రవి.

టిక్కెట్లు ఇస్తూ వెనక్కి వెళ్లిన కండక్టర్ బస్సులో ఎవరో పొగ తాగుతుంటే ఘాటుగా సీవాట్లు పెడుతున్నాడు. రవి దీనిని అవకాశంగా తీసుకుని, తాను లేచి చూడకపోతే గొడవ సద్దుమణిగిపోదన్నట్లుగా లేచి, వెనక్కి చూసి మళ్లీ తిరిగి కూర్చుంటున్నప్పుడు డాక్టరుగారి చెల్లెల్ని నిమిషమాత్ర దర్శనం చేసుకున్నాడు. ఆమె వేసుకున్న పంజాబీ డ్రెస్ ఆరెంజ్ కలర్‌లో అట్రాక్టివ్‌గా ఉంది. మెడపై ఉన్న గోల్డ్ చెయిను ఆమె ఒంటి కాంతికి ధగధగా మెరుస్తోంది. ఈరోజు తలంటి పోసుకుందేమో తన పొడవైన నల్లని నల్లని కురులను విరబోసుకుని చివర్న రిబ్బనుతో కట్టి వదిలేసింది. అది కుడిభుజంపై నుండి ముందుకు వాలి రివ్వున వీచే గాలికి కొండపై నుండి పరుగెత్తి వస్తున్న జలపాతమా అన్న భ్రమను కలిగిస్తున్నాయి.

పదిహేను నిమిషాలు గడిచాయి. బస్సు ఒక రిక్వెస్ట్ స్టాపులో ఆగి బయలుదేరింది. డాక్టరుగారి చెల్లెలు తాను చదువుతున్న పుస్తకాన్ని మూసివేసి సీటుకి ఒరిగి అలసటగా కనురెప్పలు మూసుకుంది. రెండువైపులా కిటికీల నుండి వచ్చే చల్లనిగాలికి హాయిగా అలాగే నిద్రపోయింది.

రవి ప్రయాణీకుల వైపు చూశాడు. ఎవరూ ఇటు గమనిస్తున్నట్లు లేదు. ఎవళ్ల లోకంలో వాళ్లు ఉన్నారు. ఇదే మంచి అవకాశమనుకుని ధైర్యంగా ఆమెవైపు దృష్టి సారించాడు.

ముంగురుల మబ్బులు తేలాడే ఫాలాకాశంలో ఎర్రని గుండ్రని బొట్టు ఉదయించిన అరుణబింబంలా ఉంది. ఆమె నిమీలిత నేత్రాలు అనంత సౌందర్య భావసముద్రాలను దాచుకున్న దివ్యమైన పేటికల్లా ఉన్నాయి. ఆ అందమైన నాసిక సుప్రసిద్ధ ప్రపంచ కవులందరూ చేసిన వర్ణనల మేరకు ఆ బ్రహ్మ చాలానాళ్లు శ్రమపడి శ్రద్ధగా చెక్కినట్లుంది. తీయతీయని మాటలనూరించే తేనెరంగు పెదవులు మౌనంగా తపస్సు చేసుకుంటున్న ముని కుమారికల్లాగా ఉన్నాయి. ఆరోగ్యంగా ఉన్న కంఠం ఎన్ని స్వర్ణాభరణాలతో అలంకరించినా ఇంకా తక్కువే అన్నట్లుగా ఉంది!

రవి మధురోహలు ఇంతటితో ఆగిపోయాయి. ఎందుకంటే కిటికీ నుండి ఎండ ఆమెపై పడుతోంది. గబగబా కిటికీని మూసేశాడు. మూసేసిన ఆ నల్లటి అద్దంలోంచి చురుక్కుమనిపిస్తోంది ఎండ. రవికి ఇక ఏం చేయాలో తోచక ఆమెపై ఎండ పడకుండా తానే ముందు సీటువైపు వాలి అక్కడనుండి మళ్లీ ప్రకృతి పరిశీలనలో నిమగ్నమైపోయాడు. మరో పది నిమిషాలు గడిచాయి. అలా ప్రకృతిని చూస్తూండగానే రవికి కూడా కునుకు పట్టేసింది.

మధ్యలో బస్సు రెండో రిక్వెస్ట్ స్టాపులో ఆగి ప్రయాణీకుల్ని దించి, కొందరిని ఎక్కించుకుని బయలుదేరింది. ఇంకో పది నిమిషాలు గడిచాయి.

బస్సులో ఒక్కసారిగా గలభా వినిపించి రవి ఉలిక్కిపడి లేచాడు. పక్కన కూర్చుని ఉన్న డాక్టరుగారి చెల్లెలు మెడను తడుముకుంటోంది.

"ఏమయింది?" అని అడిగాడు.

"నా బంగారు గొలుసు కనిపించడంలేదు!" అని గాభరాగా అంటూ, "దానిని మొన్ననే మా అన్నయ్య బర్త్‌డే గిఫ్ట్‌గా ప్రెజెంట్ చేశాడు!" అని జ్ఞాపకం చేసుకుంది.

"అయ్యో! ఎక్కడైనా కిందపడిపోయిందేమో చూడమ్మా?"

"ఆ! ఎక్కడ దొరుకుతుంది? గొలుసు కొట్టేసినవాళ్లు ఇంతకు ముందు స్టాపులో దిగిపోయి ఉంటారు!"

"అయ్యో! బంగారపు గొలుసు పోయిందా? పాపం, విలువైన వస్తువులన్నీ జాగ్రత్తగా చూసుకోవాలమ్మా!"

ఇలా రకరకాలుగా బస్సులో ఉన్న ప్రయాణీకులు సానుభూతి వాక్యాలు పలుకుతున్నారు.

"కిందగానీ పడిందేమో చూశారా?" అని అడుగుతూ రవి సీటు కిందకి వంగి చూసి, లేచి మళ్లీ కూర్చుంటూండగా

"నువ్వుగానీ తీశావా?" అని తర్జని చూపించి అడుగుతూనే, "నువ్వే తీసుంటావు!" అంటూ

నేరాన్ని ఆరోపించింది డాక్టరుగారి చెల్లెలు.

ఆమె అలా ఆరోపించడంతో రవి అవాక్కయిపోయాడు. ఆ నేరారోపణ అతడి మనసుకి అశనిపాతంలా తగిలింది.

"అవునమ్మా! వీడే అయి ఉంటాడు. పైకి ఇట్లాగే పరిచయమున్నవాళ్లలాగా ఉంటారు ... ఇట్లాంటి దొంగపనులు చేస్తుంటారు! నీకు టిక్కెట్టు కూడా కొనిపెట్టాడుగా? బాగానే నమ్మించాడు!"

"నిజమేనమ్మాయ్! నేను గమనిస్తూనే ఉన్నాను. నీవు నిద్రపోతున్నప్పుడు మాటిమాటికీ వీడు నీ మెడవైపే చూశాడు!" అంటూ వెనకా, పక్కనా ఉన్న ఆడా మగా ప్రయాణీకులు ఆవిడ చేసిన నేరారోపణకు బలం చేకూరేలా విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు.

రవికి ఒళ్లంతా చెమటలు పట్టేశాయి. గొంతు పెగలడంలేదు. ఎందుకంటే ఇటువంటి అనూహ్యమైన, ఘరమైన దుస్థితిని ఎప్పుడు ఎదుర్కోలేదు. తాను చేయని నేరానికి తనను దోషి అంటున్నారంటే లోపలినుండి దుఃఖం వస్తోంది.

"నేను తీయలేదండీ ... నిజంగా!" అని అతి కష్టంగా పలికాడు.

వెనకనుండి ఒక ప్రయాణీకుడు లేచి "నీవు తియకపోతే ఎవడు తీస్తాడ్రా?" గదమాయించాడు.

"వెధవకి నాలుగు తగిలించండి!" అంది ఇంకో ప్రయాణీకుడి గొంతు.

ముందునుండి ఒక ప్రయాణీకుడు వచ్చి "వీణ్ణి సోదా చేయమంటారా?" అని అడిగాడు డాక్టరుగారి చెల్లెల్ని.

"చేయండి!" అంది ఆమె.

ఒక ప్రయాణీకుడు రవి చేతిలోని ఫైలు లాక్కుని సూక్ష్మంగా తనిఖీ చేయసాగాడు. ఇంకొక ప్రయాణీకుడు సీటులోంచి లేపి మధ్యకు తీసుకొచ్చాడు. ఇద్దరు ప్రయాణీకులు రవి జేబుల్ని సోదా చేశారు. గొలుసు దొరకలేదు.

"చైన్ కొట్టేసినవాళ్లు ఇంతకు ముందరి స్టాపులోనే దిగిపోయి ఉంటారు!" అని అందరు ప్రయాణీకులు ఏకాభిప్రాయానికి వచ్చి రవిని వదిలేసి, ఫైలును ఇచ్చేశారు.

రవి మళ్లీ తన సీట్లో కూర్చున్నాడు. కానీ... తల కొట్టేసినట్లుగా ఉంది. తాను అవమానభారంతో అధఃపాతాళానికి కూరుకుపోతున్నట్లుగా అనిపిస్తోంది.

తాను ఈమె గురించి ఎంతో గొప్పగా ఊహించుకున్నాడు. ఏమో ఏమేమో అనుకున్నాడు. కానీ చివరికి జరిగిందేమిటి? నా గురించి ఇంత నీచంగా ఎలా ఆలోచించగలిగింది? వీళ్ల అన్నయ్యకీ, ఈమెకీ ఎంత తేడా?

వీళ్ల అన్నయ్య దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతుకుతున్నానని ఇంత తేలికగా చూస్తున్నట్లుంది. తాను అతి సామాన్యుడిననీ, ఆవిడ సంపన్నురాలనీ చూస్తేనే తెలిసిపోతుంది. కాబట్టే ప్రయాణీకులు ఆమెకే వత్తాసు పలుకుతున్నారు. అయినా వర్క్ షాపులో తాను పనిచేస్తున్నంత మాత్రాన దొంగబుద్ధి అంటగట్టాలా? ఏదేమైనా జరిగిన అవమానాన్ని హరాయించుకోలేకపోతున్నాడు. తన మనసులోని ఊహకూ, చేదు వాస్తవానికీ మధ్య కొంచెమైనా ఒద్దిక కుదరకపోవడం వల్ల తీవ్ర సంఘర్షణకు గురవుతున్నాడు. డాక్టరుగారి చెల్లెలిపై ఉన్న గౌరవం మంచులా కరిగిపోసాగింది. ఇప్పుడు ఆమె వైపు చూడబుద్ధి కావడంలేదు.

కరీంనగర్ వచ్చేసింది. డాక్టరుగారి చెల్లెలు తన వానిటీబాగ్ సర్దుకుంటూ అందులోకి చూసి ఎందుకో నాలిక కొరుక్కుంది. ఇంతలో వెనక ఉన్న ప్రయాణీకుడు ముందుకు వచ్చి ఆమె అడగకుండానే సూట్‌కేస్‌ను పైనుండి తీసి ఇచ్చి, "జాగ్రత్తగా వెళ్లండి!" అని హెచ్చరిక చేసి వెళ్లాడు.

డాక్టరుగారి చెల్లెలు బస్సు దిగిన తరువాత కొందరు ప్రయాణీకులను వెళ్లనిచ్చి రవి దిగాడు. ఆమె కింద నిలబడి ఉంది. ముఖం తిప్పుకుని నడవబోయాడు. ఆమె "సారీ అండీ! నా గొలుసు ఎక్కడా పోలేదండీ. నేను పుస్తకం తీస్తున్నప్పుడు అది జారి వానిటీ బాగ్‌లో పడ్డట్లుంది. నేను గమనించలేదు. అనవసరంగా మిమ్మల్ని అవమానించాను, క్షమించండి!" అంటూ అపాలజీ చెప్పింది.

పదిమంది ముందు చెప్పుతో ఈడ్చికొట్టినంతగా అవమానించి, అంత ఈజీగా అపాలజీ చెబుతోంది ఈవిడ! అనుకుంటూ రవి ఆమెకు ఎటువంటి సమాధానం ఇవ్వకుండా మౌనంగా నిలబడ్డాడు. మళ్లీ ఆమె "నన్ను హైదరాబాదు బస్సు ఎక్కించమని అన్నయ్య మీతో చెప్పారుగా? ప్లీజ్... ఎక్కించరూ?" అని అభ్యర్థించింది.

రవి ఆమె అభ్యర్థనకు కరిగిపోలేదు కానీ, డాక్టరుగారు చెప్పారు కాబట్టి మౌనంగానే ఆమెను తీసుకెళ్లి కాంటీన్లో కూర్చోబెట్టి, తాను షర్టు కొనుక్కుందామని తెచ్చుకున్న డబ్బులోంచి కౌంటర్లో ఒక హైదరాబాద్ టికెట్ తీసుకుని, ఆమెను సూపర్ డీలక్స్ బస్సులో కూర్చోబెట్టి, ఆమె బస్సు చార్జీ డబ్బులు లెక్కపెట్టి ఇవ్వబోతూంటే, నమస్కారం పెట్టి గబగబా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసువైపు వెళ్లిపోయాడు. ■

# డాగ్ నాపర్

అమెరికాలో లాస్ ఏంజెలెస్‌కి చెందిన హెన్రీ కెంప్(58) పెంపుడు కుక్క బ్రౌడిని డాగ్‌నాప్ చేశాడు డయని గ్రే(19) అనే కుర్రాడు. దాన్ని తిరిగి ఇవ్వడానికి 500 డాలర్లు డిమాండ్ చేశాడు.

మర్నాడు సూపర్‌మార్కెట్‌లోని కారు పార్కింగ్ ఏరియాకి ఆ డబ్బుతో రమ్మని చెప్పాడు డాగ్‌నాపర్ డయని. అయితే అతనికి తెలియదు హెన్రీ పోలీసులను కాంటాక్ట్ చేశాడని. ఆ పార్కింగ్ లాట్‌లో కుక్కతో ఓ తెల్లకారులో వచ్చాడు డయని. 500 డాలర్లు లెక్కపెట్టి హెన్రీ ఇస్తూండగా 15మంది పోలీసు ఆఫీసర్లు వచ్చి చుట్టుముట్టారు. అంతే కాదు, అవసరమైతే ఆ తెల్లకారుని వెంటాడటానికి వీలుగా పోలీస్ హెలికాప్టర్ ఒకటి పైన తిరుగుతోంది. క్షణాల్లో డయనికి బేడీలు వేశారు పోలీసులు.

జడ్జి అతనికి 120 రోజులు జైలుశిక్ష వేశాడు. ఓ కుక్కని దొంగిలించిన దొంగని పట్టుకోడానికి మొత్తం అయిదు పోలీసు కార్లు, ఓ హెలికాప్టర్ రావడంతో ఇది మర్నాడు దినపత్రికల్లో ఫ్రంట్ పేజీ న్యూస్ ఐటమ్ అయింది. కాలిఫోర్నియా స్టేట్‌లో అదే తొలి డాగ్‌నాపింగ్ కేసు.

-ఎం. ఊహ

